క్లుప్తంగా

శ్రీపుష్పోత్సవ పూజలు



కపిలేశ్వరపురం జనార్దనస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: స్థానిక జనార్దనస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవాల ముగింపును పురస్కరించుకుని వేద పండితులు శ్రీపుష్పోత్సవ పూజలు చేశారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

నిరుపేదలకు ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ సేకరణ వస్తువులు



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ద్వారా సేకరించిన వస్తువులను అందించిన చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: మున్సిపల్ కమిషనర్ కె శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మేరీ లైఫ్, మేరీ షెహర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ద్వారా సేకరించిన వస్తువులను నిరుపేదలకు పంపిణీ చేశారు. పట్టణంలోని 7వ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో మే 20 నుంచి ఈనెల 5 వరకు సేకరించిన వివిధ వస్తువులను మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి చేతుల మీదుగా అందజేశారు. వార్డు కౌన్సిలర్‌లు పోతంశెట్టి శ్యామలగోపాలకృష్ణ, పెంటపాటి దేవి శ్రీనివాస్, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకం



ప్రతిభ కనబరిచిన గ్రామీణ విద్యార్థులను అభినందిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమైనదని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అద్దాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శేషారత్నం, సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి అన్నారు. అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాలలో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మొదటి, ద్వితీయ సంవత్సరం కళాశాల విద్యార్థులకు ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సత్కరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించడం నేటి విద్యార్థులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ పీవీ రమణ, వాకా రాజా, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు పరీక్షలు



నెలపర్తిపాడులో కంటివెలుగు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని నెలపర్తిపాడులో వైఎస్సార్ కంటి వెలుగు స్క్రీన్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. పారామెడికల్ ఆప్తమాలజిస్టు ధర్మవరపు కోటేశ్వరరావు నేతృత్వంలో 30 మందికి పరీక్షలు చేశారు. 15 మందికి కళ్లజోళ్లను, ముగ్గురికి సర్జరీలు అవసరంగా గుర్తించినట్లు తెలిపారు. ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చోరీ నిందితుడి అరెస్ట్

రామచంద్రపురం: ఎవరూ లేని సమయంలో ఇంటిలో ప్రవేశించి చోరీ చేసిన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్సై డి.సురేష్‌బాబు మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. గత నెల 30న పట్టణంలోని చింతపల్లి సూరన్ననగర్‌కు చెందిన అయినవిల్లి ప్రసాద్ ఇంటికి తాళం వేసి పని నిమిత్తం తణుకు వెళ్లారు. అదే రోజు రాత్రి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి చోరులు ఇంటిలోకి ప్రవేశించి సుమారుగా 20 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు అపహరించుకుపోయారని ఎస్సై తెలిపారు. ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి డీఎస్పీ టీఎస్ ఆర్‌కే ప్రసాద్, సీఐ వి.దుర్గారావుల నేతృత్వంలో దర్యాప్తు చేయగా రాజానగరం మండలం రాధేయపాలెంకు చెందిన రెడ్డి సురేష్‌ని ముద్దాయిగా గుర్తించి కొత్తూరు జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వాతావరణం..

- ఉష్ణ తాపానికి ఉక్కపోత తోడు
- అప్రకటిత కర్ఫ్యూను తలపిస్తున్న రహదారులు



గొడుగే అండగా..



రాయవరంలో ఉదయం 11 గంటలకే కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్న ప్రధాన రహదారి

రాయవరం: భానుడు రోజు రోజుకూ తన భగభగలు పెంచుకుంటూ పోతున్నాడు. రోహిణి కార్తె చివరి దశకు చేరుకోవడంతో సూరీడు తన ప్రతాపాన్ని మరింతగా చూపుతున్నాడు. ఈ నెల 8తో రోహిణీ కార్తె ముగియనుంది. సాధారణంగా జూన్ మొదటి వారానికే నైరుతి రుతుపవనాల ఆగమనం ఉంటుంది. జూన్ రెండో వారంలో కూడా నైరుతి రుతుపవనాలు ముఖం చాటేయడంతో పాటు, తగ్గని ఉష్ణతాపానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండలకు తోడు ఉక్కపోత ప్రజలను ఊపిరాడనివ్వడం లేదు. వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు ప్రజలు చల్లని పానీయాలతో సేద తీరుతున్నారు. దీనితో సహజంగానే శీతల పానీయాలకు గిరాకీ పెరిగింది.

అల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులు

ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి రావడానికి భయపడుతున్నారు. మధ్యమధ్యలో మబ్బులు ఏర్పడినా వేడి వాతావరణం చోటు చేసుకుంది. మంగళవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ, 48 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైన అనుభూతిని ప్రజలు పొందారు. సాయంత్రం ఐదు గంటల వరకూ ఎండ తీవ్రత అధికంగా ఉండగా, రాత్రి ఏడు గంటల సమయంలో కూడా వేడి వాతావరణం ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది. ఎండ వేడికి ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అల్లాడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఎండవేడిని తట్టుకునేందుకు టోపీలు, గొడుగులు వినియోగిస్తున్నారు.

శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ

భానుడి భగభగల నుంచి కొంతైనా ఉపశమనం పొందేందుకు శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. చల్లదనం కోసం శీతల పానీయాలు, పలు రకాల పండ్ల రసాలపై ఆసక్తి చూపుతున్నారు. దాంతో ఎక్కడ చూసినా కొబ్బరి బొండాలతో పాటుగా, శీతల పానీయాల దుకాణాలు, జ్యూస్ సెంటర్లు హడావుడి కన్పిస్తోంది. లస్సీ, బొప్పాయి, ద్రాక్ష, పైనాపిల్, పుచ్చకాయ తదితర రకాల పండ్ల రసాల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులు ఎండ తీవ్రత కారణంగా నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే అప్రకటిత కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తోంది.



ఎండవేడికి తలపాగా చుట్టుకుని ప్రయాణిస్తున్న వ్యాపారి

ఎమ్మెల్యే వేగుళ్లవి మతిభ్రమించిన మాటలు

వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు

మండపేట: ఓటమి భయంతో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మతిభ్రమించి నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ధ్వజమెత్తారు. సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా తాను అడిగిన ప్రశ్నలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు జవాబు చెప్పాలే గానీ చెంచాగాళ్లతో చెప్పించడం కాదని ఎమ్మెల్యే వేగుళ్ల చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. తాము చెంచాగాళ్లమైతే వేగుళ్ల చుట్టూ ఉన్న వారంతా ఎవరని వారు ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, పిల్లి శ్రీనివాస్, పార్టీ నాయకురాలు ఓగిరాల దేవి తదితరులు మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ హయాంలో నిర్మించిన క్రిస్టియన్ కమ్యూనిటీ హాలును ఎమ్మెల్సీ తోట ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వంట షెడ్డు, టాయిలెట్స్, విద్యుత్, ఇతర సదుపాయాలు కల్పించలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వాటిని పూర్తిచేసి అప్పగించేందుకు ఎమ్మెల్సీ తోట చర్యలు తీసుకుంటున్నారన్నారు. క్రైస్తవుల శ్మశానవాటికకు 50 సెంట్ల స్థలాన్ని ఇస్తానని దశాబ్దకాలం క్రితం వాగ్దానం చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల ఇప్పటికి తమకు స్థలాన్ని స్వాధీనం చేయలేదని కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ విమర్శించారు. తమకు స్థలం అప్పగించాలని కౌన్సిల్ సమావేశాల్లో పలుమార్లు తాను ఎమ్మెల్యే వేగుళ్లను కోరానన్నారు. క్రైస్తవులకు స్థలం స్వాధీనం చేస్తే మున్సిపాలిటీ ద్వారా ఆ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ తోట కౌన్సిల్ సమావేశంలో చెప్పారని గుర్తుచేశారు. అసంపూర్తి నిర్మాణాలతో నివాస యోగ్యంగా లేని టిడ్కో ప్లాట్లను ఎన్నికలకు ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు హడావుడిగా ప్రారంభోత్సవాలు చేయించిన విషయాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల మర్చిపోయారని ఎద్దేవా చేశారు. వాటిని పూర్తి చేసి ప్రజలకు అప్పగించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుందని వారు తెలిపారు. గత ప్రభుత్వంలో కమీషన్ల కోసం కక్కుర్తి పడి నాణ్యత లేని నిర్మాణాలు చేయడంతో టిడ్కో ప్లాట్లలో శ్లాబుల నుంచి నీరు లీకై లబ్ధిదారులు తీవ్ర అగచాట్లు పడుతున్నారని వారు విమర్శించారు. ఎస్సీ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాలు అభివృద్ధికి రూ. 48 లక్షలు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్సీ తోటకు దక్కుతుందని పేర్కొన్నారు.ఎస్సీ, బీసీ, తదితర అన్ని సామాజికవర్గాల వారి సంక్షేమానికి ఎమ్మెల్సీ తోట నిబద్ధతతో కట్టుబడి పనిచేస్తున్నారని ఆయనపై అవాకులు చవాకులు పేలితే చూస్తూ ఊరుకోమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, పార్టీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, అడబాల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో టోర్నీ విజయవంతం చేయాలి

- వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్
- ద్వారపూడిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పృథ్వీరాజ్ తదితరులు

మండపేట: ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తితో మెలగడం ద్వారా టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్ అన్నారు. ద్వారపూడిలోని రాజ్యలక్ష్మి బంగారమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీసిద్ధి వినాయక క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం పృథ్వీరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి టోర్నమెంట్లు దోహదం చేస్తాయని నిర్వాహకులను అభినందించారు. టోర్నీ నిర్వాహకులు పోతుల దుర్గాప్రసాద్, పల్లా వీరబాబు, సిరిపురపు గణేష్ మాట్లాడుతూ 12 రోజుల పాటు జరిగే టోర్నీలో అనపర్తి, బిక్కవోలు, కడియం, రామచంద్రపురం, దొంతమూరు, మాధవరాయుడిపాలెం తదితర గ్రామాల నుంచి 32 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈనెల 18న ఫైనల్ పోటీ జరుగుతుందని, టోర్నీలో గెలుపొందిన వారికి రూ. 25000, రన్నర్స్‌కు రూ.12000 నగదు బహుమతితో పాటు షీల్డ్‌లు అందజేస్తామన్నారు. పంచాయతీ ఉప సర్పంచ్ తులా శేషారావు, గ్రామ ప్రముఖులు తులా రంగారావు, పోతుల రాంబాబు, సత్తి సత్తిబాబు, యరగతపు విజయకుమార్, దూలం రాంబాబు, శ్రీసిద్ధి వినాయక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మృతుల ఆత్మశాంతికి మండపేటలో శాంతి ర్యాలీ



మండపేటలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న బీసీ సంఘ నాయకులు

మండపేట: ఒడిస్సాలోని బాలాసోర్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో అసువులు బాసిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మండపేటలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులర్పిస్తూ స్థానిక కలువ పువ్వు సెంటర్ నుంచి కొవ్వొత్తులతో బస్టాండు వరకూ ర్యాలీ చేశారు. సంఘ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కోన సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఘోర ప్రమాదం వందల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపిందన్నారు. రైల్వే సిగ్నల్ సిబ్బంది అలసత్వంతో 288 మంది ప్రాణాలు గాల్లో కలిసిపోగా 1175 మంది ప్రయాణికులు గాయపడ్డారన్నారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ నాయకులు పెంకే గంగాధరరావు, టేకి శ్రీను, శీలామంతుల సత్యనారాయణ, చుక్కల అప్పారావు, చుక్కల సూరిబాబు, జక్కా రామంజనేయులు, యాగన శ్రీనువాస్, సూరంపూడి సత్యప్రసాద్, జుత్తుగ సూరిబాబు, కింతాడ హేమశ్రీనివాస్, బవిరి సత్యనారాయణ, జక్కా రామకృష్ణ, ఒంపోలు పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి



గొల్లపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ సభ్యులు, సచివాలయ సిబ్బంది

కాజులూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని వైఎస్సార్ సీపీ మండల మహిళా విభాగం నేత, గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అన్నారు. పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయాల సిబ్బంది గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి రోడ్డుపక్కల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ప్రసన్నమౌనిక మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలపాత్ర, మొక్కల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయం-2 కార్యదర్శి జహంగీర్, సచివాలయం సిబ్బంది సాయి, శివ, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలి

కాజులూరు: సేద్యంలో సేంద్రియ ఎరువుల వాడకానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని మతుకుమిల్లి, టి.మామిడాడ, తర్లంపూడి తదితర గ్రామాల్లో ఆయన రైతులతో మాట్లాడుతూ రసాయన ఎరువుల రేట్లు రోజురోజుకీ పెరిగిపోతుండటంతో సేద్యంలో ఖర్చులు అధికమై నికర ఆదాయం తగ్గిపోతుందన్నారు. వ్యయాలు పెరగటమే కాకుండా పంట ఉత్పత్తులు విషతుల్యమై అంతర్జాతీయ మార్కెట్‌లో నాణ్యత లోపించే ప్రమాదం ఉందన్నారు. విత్తనశుద్ధికి జీవామృతం వినియోగం, సస్యరక్షణకు గోవు పేడ, మూత్రం, కషాయం వంటివి తయారు చేసి పంటలకు సోకే పలురకాల తెగుళ్లపై వినియోగించవచ్చన్నారు. వీఏఏలు పలువురు స్థానిక రైతులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బందికి వ్యాధులపై అవగాహన



గొల్లపాలెం పీహెచ్‌సీలో సిబ్బందికి హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కాజులూరు: రోగుల పట్ల వైద్య సిబ్బంది ఆదరాభిమానాలు కలిగి ఉండాలని తాళ్లరేవు బీమాబాయి మండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధిని అన్నారు. గొల్లపాలెం పీహెచ్‌సీలో మంగళవారం బీమాబాయి మండలి సభ్యులు ఆరోగ్య పరిరక్షణ సేవలు, రోగుల హక్కులపై పీహెచ్‌సీ సిబ్బందికి ఏఎన్ఎంలు, ఆశా వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌజన్య, ఎంపీహెచ్ఎస్‌లు వైకుంఠరావు, సత్యనారాయణలు సిబ్బందికి హెచ్ఐవి సోకే విధానం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా మండలి ఫీల్డ్ కోఆర్డినేటర్ జి.రామయ్యశెట్టి, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు లేక ఇక్కట్లు

మండపేట: గత ప్రభుత్వంలో పట్టణంలోని పెద కాలువపై నిర్మించిన రెండవ వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో వైఎస్సార్ సీపీ పాలకులు విఫలమయ్యారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ వంతెన వద్ద టీడీపీ నాయకులతో కలిసి మంగళవారం ఆయన సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

స్థిరమైన సామాజికాభివృద్ధే లక్ష్యంగా...

- గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్‌డీజీ సర్వే
- ప్రత్యేక యాప్ ద్వారా నిర్వహణ
- ఆరోగ్య అంశాలకు మొదటి ప్రాధాన్యం



అంగరలో సర్వే చేస్తున్న వైద్య, ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: ప్రజల బాగోగులు చూసేందుకు వారి తాలూకు సమగ్ర సమాచారం ఎంతైనా అవసరం. జనం అవగాహన స్థాయి, ఆచరణ అంశాల్లో ఎన్నో వ్యత్యాసాలు ఉండనే ఉంటాయి. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే కార్యాచరణను చేపట్టింది. 2022 నవంబర్ 14న ప్రజల సామాజిక, ఆర్థిక అంశాలపై సర్వేను ప్రారంభించింది. ఆ ప్రక్రియను క్రమం తప్పకుండా నేటికీ కొనసాగిస్తోంది. ప్రజల అవసరాలు, వారి ఆశలు, ఆకాంక్షలను ఎప్పటికప్పుడు సర్వే ద్వారా తెలుసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సర్వే క్రమంలో ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నావళి క్షేత్రస్థాయి పాలనలో కీలకాంశాలకు దోహదపడుతున్నాయి. సమగ్ర సర్వే కార్యాచరణలో ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు శ్రమిస్తున్నారు. ఆరోగ్య అంశాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) లక్ష్యంగా సాగుతున్న సర్వేపై ఈ కథనం...

సర్వే లక్ష్యమిదీ....

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను, సర్వీసులను అందిస్తూ 2030 లోగా 17 విభాగాల్లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్)ను సాధించాలని సంకల్పించింది. ఆ దిశగా అడుగులు వేసేందుకు క్షేత్ర స్థాయి నుంచి సమాచారాన్ని ప్రభుత్వం కోరుతుంది. 0-5 సంవత్సరాల చిన్నారుల నుంచి 6-17, 18-23, 15-49 సంవత్సరాలుగల నాలుగు విభాగాలుగా సర్వే చేస్తున్నారు.

సర్వే కార్యసాధకులిలా...

ఎస్‌డీజీ సర్వే బాధ్యతను ప్రభుత్వం ప్రారంభ రోజుల్లో వలంటీర్లను భాగస్వాములను చేసింది. సర్వే ప్రక్రియకు సమగ్రత వచ్చాక ప్రభుత్వ శాఖల సిబ్బంది సర్వేను కొనసాగిస్తున్నారు. సర్వేలో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నారు. సుమారు రెండు నెలలకొకసారి సర్వేను క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రామచంద్రపురం, మండపేట ప్రభుత్వ ఆసుపత్రులు, దుగ్గుదూరు, గొల్లపాలెం, ద్రాక్షారామ, వెల్ల, పామర్రు, మండపేట అర్బన్, కేశవరం, ద్వారపూడి, అచ్యుతాపురం, వాకతిప్ప, అంగర పీహెచ్‌సీల పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల ద్వారా సర్వే ముమ్మరంగా సాగుతోంది. రామచంద్రపురం నియోజకవర్గంలో 77 గ్రామాల్లో 67, పట్టణంలో 12 మొత్తం 79 సచివాలయాలున్నాయి. వాటి పరిధిలో 1,480 మంది వలంటీర్లు ఉన్నారు. మండపేట నియోజకవర్గంలో 43 గ్రామాల్లో 62, పట్టణంలో 14 మొత్తం 76 సచివాలయాలున్నాయి. వాటి పరిధిలో 1,157 మంది వలంటీర్లు సేవలందిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో 120 గ్రామాలు, రెండు పట్టణాల పరిధిలో 155 సచివాలయాలు, 2,637 మంది వలంటీర్లు సర్వేలో భాగస్వాములవుతున్నారు.

పర్యవేక్షణతో సత్ఫలితాలు...

మండల స్థాయిలో ఎంపీడీఓ, గ్రామ స్థాయిలో కార్యదర్శి సర్వేను పర్యవేక్షిస్తున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయ సహాయకులు మినహా మిగిలిన సచివాలయ ఉద్యోగులంతా సర్వేలో భాగస్వాములవుతున్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి యాప్‌లో పొందుపర్చిన ప్రశ్నావళి ప్రకారం వివరాలను నమోదు చేస్తారు. వాటిని జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షించి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలిస్తున్నారు. గర్భిణుల సమస్యలను వైద్య,ఆరోగ్య శాఖ, చిన్నారులు పౌష్టికాహారానికి సంబంధించి ఐసీడీఎస్, వివిధ శస్త్ర చికిత్సలకు సంబంధించి ఆరోగ్యశ్రీ ఇలా సమస్యలను ఆయా శాఖలకు నివేదిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి సర్వే దోహదం

ఎస్‌డీజీ సర్వే చాలా విస్తృతమైన లక్ష్యంతో సాగుతోంది. ప్రస్తుతం సమస్యలను గుర్తించడానికి, భవిష్యత్ ప్రణాళికలకు ఈ సర్వే మార్గదర్శకంగా నిలుస్తోంది. ఈ సర్వేలో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ప్రధాన భూమికను పోషిస్తున్నది.

- ఎం.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ, కపిలేశ్వరపురం

డీసీసీబీ ప్యానల్ అడ్వొకేట్‌గా సాయిప్రసాద్



మంత్రి వేణు నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న సాయిప్రసాద్

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ ప్యానల్ అడ్వొకేట్‌గా వైఎస్సార్ సీపీ నేత, సీనియర్ న్యాయవాది వాడ్రేవు సాయిప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా సాయిప్రసాద్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. తనను డీసీసీబీ ప్యానెల్ అడ్వొకేట్‌గా నియమించినందుకు మంత్రి వేణు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజులకు సాయిప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం: మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కపిలేశ్వరపురం ప్రాజెక్టు సీడీపీఓ గజలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనతో తెలిపారు. మండలంలోని కె.గంగవరంలో గల నెంబర్-3 అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు బీసీ-డీ రిజర్వేషన్ గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీంతో పాటు అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుకు నరజాడ-బీసీ-ఎ, తామరపల్లి-ఓసీ, రావిదొడ్డిపేట-ఎస్సీ, శేరిలంక-ఓసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కార్యాలయ పని వేళల్లో కపిలేశ్వరపురంలోని ప్రాజెక్టు కార్యాలయం వద్ద దరఖాస్తులు అందించాలని కోరారు. అర్హులైన దరఖాస్తుదారులకు సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు.

పరిశోధకుడు దివ్యశేఖర్‌కు సత్కారం



అంగరలో డాక్టర్ వాకా దివ్యశేఖర్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం: సింథటిక్ అపర్చుర్ రాడాల్ శాటిలైట్ చిత్రాలు ఉపయోగించి భూమి కదలికలపై పరిశోధన చేసిన మండలంలోని అంగరకు చెందిన యువకుడు వాకా దివ్యశేఖర్‌ను మంగళవారం ఆ గ్రామంలో ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన విద్యావేత్తలు, అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సత్కారంలో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అద్దాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి శేషారత్నం దివ్య శేఖర్‌ను అభినందించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు ప్రతిభ కనబరచడం నేటి యువతకు ఆదర్శమన్నారు. ఐఐడీ బాంబ పీహెచ్‌డీ పట్టా పొందిన దివ్య శేఖర్‌ను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దివ్యశేఖర్ తల్లిదండ్రులు వాకా పరమేశ్వర, కృష్ణ కుమారి దంపతులను ప్రశంసించారు.

కారుణ్య నియామక పత్రం అందజేత



లక్ష్మణ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్డీవో సింధూ సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం రూరల్: అనారోగ్య కారణంలో వలంటరీ రిటైర్‌మెంట్ పొందిన ద్రాక్షారామ వీఆర్వో మనోహర్ కుమారుడు లక్ష్మణ్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా కారుణ్య నియామకాన్ని ప్రభుత్వం అందజేసింది. ఈ మేరకు రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియామక ఉత్తర్వులను ఆర్డీవో పి.సింధు సుబ్రహ్మణ్యం మంగళవారం లక్ష్మణ్‌కు అందజేశారు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఎం.బాపూజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, కలెక్టర్ హిమాన్షుశుక్లా తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.